

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వర నాయుడు



అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్వోతో పాటు డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు, ఉపాధి కల్పనాధికారి సురేశ్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు.

కొన్ని ఫిర్యాదులు..

● ఖాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామానికి చెందిన జయకర్ ఫిర్యాదు చేస్తూ తనకు 201/10 సర్వే నెంబరులో 1.19 ఎకరాల భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదే గ్రామానికి చెందిన రమణయ్య తన భూమిని ఆక్రమించాడన్నారు. దీనిపై ఐదేళ్లుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా అన్నారు. తమను ఆ భూమిలోకి రానివ్వకుండా భయపెడుతున్నాడని ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఒంటిమిట్టకు చెందిన శ్రీనివాసులు.. తనకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిందని, తాను నడవలేనని వికలాంగ సర్టిఫికెట్ మంజూరు చేసి పెన్షన్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

● తన కుమారుడికి 7 ఏళ్లు ఉన్నా ఎదుగుబొదుగు లేదని, వైద్యులకు చూపగా రూ.2 లక్షల ఖర్చుతో ఆపరేషన్ చేయాలన్నారని ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ జరిగేలా చూడాలని సిద్దవటం మండలం హరిజనవాడకు చెందిన పొన్నూరు వెంకటమ్మ కోరారు.

● ఖాజీపేట మండల కేంద్రానికి చెందిన మహబూబ్ హుసేన్ తనకు సర్వే నెంబర్ 74లో 25 సెంట్ల భూమి ఉందని, ఆ భూమికి హద్దులు చూపాలని కోరారు.

నీటి కష్టాలను తీర్చండి

● కల్వకుర్తి, నంద్యాల మధ్య పెన్నాలో అలుగు నిర్మించండి

● మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ నీటి కష్టాలు తీర్చాలని శాసన మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. తెలంగాణ కల్వకుర్తి నుంచి పెన్నానదిలో నంద్యాల జిల్లాకు హైవే నిర్మిస్తున్నారని, తీగల వంతెన మాదిరిగా ఏర్పాటుచేస్తున్నారని అన్నారు. అక్కడ అలుగు నిర్మిస్తే 60 నుంచి 70టీఎంసీల నీరు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు అందుతుందని తెలిపారు. సోమవారం మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో సిద్దేశ్వరం అలుగు నిర్మించాలని స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనుకున్నారని, తద్వారా రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు నీరు అందుతుందని ప్రతిపాదన ఉందన్నారు. అయితే ప్రాంతీయ విద్వేషాలను తెరపైకి తెచ్చి చెన్నపట్టణానికి నీళ్లు తరలిస్తున్నారనే ప్రచారంతో అలుగు నిర్మాణం చేపట్టలేదన్నారు. శ్రీశైలంలో 300టీఎంసీల వరకు నీరు నిల్వ ఉండాల్సి ఉండగా వంద టీఎంసీల వరకు పూడిక చేరిందన్నారు. దీంతో రాయలసీమకు నీటి కష్టాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ డిస్కంలపై అవినీతి భారం పడిందని ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ మోటార్లు బిగించకున్నా బిగించినట్లు బిల్లులు చేసుకున్నారని, ఇందులో వందల కోట్ల కుంభకోణం జరిగిందని ఎమ్మెల్సీ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేసి ఎన్ని వ్యవసాయ మోటార్లు బిగించారు, ఎన్ని ఉన్నాయి, ఎంత బిల్లు చేసుకున్నారన్నది పరిశీలిస్తే కుంభకోణం బయటపడుతుందని తెలిపారు. దీనిపై విద్యుత్ శాఖ మంత్రి స్పందిస్తూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

వీరభద్రాలయంలో గౌరీ పూజ 6

అమ్మవారి తాళిబొట్టును భక్తులకు చూపుతున్న పూజారులు



ఆనందభరితం.. ఆదిదంపతుల కల్యాణం

● వైభవంగా రథోత్సవం

పెండ్లిమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొలతలలో కొలువైన మల్లికార్జునస్వామి అమ్మవార్లకు సోమవారం కల్యాణం కన్నుల పండవలా జరిగింది. జిల్లాలోని శైవక్షేత్రాలలో పొలతల మల్లికార్జునస్వామి ప్రముఖమైనది. కార్తీకమాసం వచ్చిందంటే భక్తులు తరలివచ్చి ఇక్కడి కోనేరులలో స్నానాలు ఆచరించి శివపార్వతులను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మూడవ కార్తీక సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పొలతల చేరుకుని స్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లతో పాటు అక్కదేవతలు, బండెన్న స్వామి, పుట్ట ఆంజనేయస్వాములకు పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 10గంటలకు ముత్యాల తలంబ్రాలతో స్వామి అమ్మవార్లకు కన్నులపండువలా కల్యాణాన్ని నిర్వహించారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దంపతులు, చైతన్యరెడ్డి దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం వారిని ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణానాయక్, టీడీపీ నేత సిరిగిరెడ్డి రాజారెడ్డి సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను రథంపై గర్భగుడి నుంచి అక్కదేవతల గుడి వరకు ఊరేగించారు.



సతీసమేతంగా కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

అడ్డదిడ్డంగా జగనన్న రీసర్వే

● రెవెన్యూ సదస్సుల్లో 6 వేలకు పైగా ఫిర్యాదులు

● రైతుల సమస్యల పరిష్కారం కోసం అధికారుల కసరత్తు

వైసీపీ పాలనలో జగనన్న శాశ్వత భూహక్కు జగనన్న భూముల రీసర్వే పేరుతో అడ్డదిడ్డంగా భూముల కొలతలు వేసి సరిహద్దు రాళ్లు పాతారు. రీసర్వేలో పాత హద్దులు చెరగడం, రెవెన్యూ రికార్డుల్లో విస్తీర్ణం, మ్యుటేషన్ల నమోదులో వ్యత్యాసాలు, జగనన్న బొమ్మలతో పాస్‌బుక్కులు, సరిహద్దు రాళ్లను కూడా వదలకుండా జగన్ బొమ్మలు.. వెరసి భూములున్న రైతులు ఆందోళనకు గురయ్యారు. కొన్నిచోట్ల నోటీసులు కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా రీసర్వే చేశారంటూ గత ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై రైతులు కూటమి ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. విభజిత రాష్ట్రానికి చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతుల సమస్యలు పరిష్కరించి, న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టారు.

కడప కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగనన్న శాశ్వత భూహక్కు, రీసర్వే ప్రక్రియలో జరిగిన అవకతవకలు, అప్పట్లో పాలకులకు తలొగ్గి రెవెన్యూ యంత్రాంగం జీ హుజూర్ అంటూ చేసిన తప్పిదాలను చక్కదిద్దేందుకు జిల్లా అధికారులు నడుము బిగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నెల రోజులుగా రీసర్వే జరిగిన 285 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. జిల్లాలో 22,36,454.1 ఎకరాల భూములు ఉండగా అందులో నాలుగు దశలుగా 285 గ్రామాల పరిధిలోని 4,66,461.56 ఎకరాల్లో రీసర్వే సాగింది. రెవెన్యూ, భూముల రీసర్వేలకు సంబంధించి అన్యాయం జరిగిందంటూ పెద్ద ఎత్తున 6 వేలకు పైగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఇటు రెవెన్యూ, అటు భూముల రికార్డులు, కొలతలశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పోటాపోటీగా ఫిర్యాదులు

జిల్లా వ్యాప్తంగా నాలుగు దఫాల్లో జరిగిన రీసర్వే, ఆ భూములను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడంలో చోటుచేసుకున్న తప్పొప్పులపై గ్రామ సభల్లో రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రీసర్వే తప్పిదాలపై 3,900 ఫిర్యాదులు రాగా, రెవెన్యూ రికార్డుల తప్పులపై 2,125 మంది రైతులు ఫిర్యాదు చేశారు. రీసర్వే తప్పిదాలపై జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో 49 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రైతుల నుంచి 1200 వరకు ఫిర్యాదులు వచ్చాయి. ఇకపోతే అప్పట్లో కొన్ని మండలాల తహశీల్దార్లు వైసీపీ నేతలతో అంటకాగి తప్పిదాలకు పాల్పడ్డారనే అపవాదు ఉంది. తాతల కాలం నుంచి అనుభవిస్తున్నప్పటికీ ఆ భూములకు రెవెన్యూ రికార్డుల్లో పేర్లు లేకపోవడం, చుక్కల భూములకు సరైన ఆధారాలు చూపలేని రైతుల నోళ్లలో దుమ్ముకొట్టి వాటిని వైసీపీ చోటా, మోటా నేతలకు ఆ భూములు కట్టబెట్టారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే, రెవెన్యూ తప్పిదాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో సంబంధిత అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

63 వేల పాస్‌బుక్కులు రద్దు

తాతల కాలం నుంచి కష్టించి సంపాదించుకున్న భూములకు సొమ్మొకరిది.. సోకొకరిదీ అన్నట్లుగా 63 వేల పాస్ బుక్కులను జగన్ బొమ్మలతో జారీ చేశారు. దీనిని రైతులు ఆక్షేపించడంతో చంద్రబాబు సర్కారు ఇప్పటికే వీటిని రద్దుచేసింది. అంతేకాకుండా రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో విశాలంగా గట్లతో ఉన్న భూముల్లో 3.66 లక్షల జగనన్న సరిహద్దు రాళ్లు నాటడంతో నేడు ట్రాక్టర్, ఎద్దులతో పంట సాగు చేయడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఈ రాళ్లను తొలగించడమా? లేక రైతుల భూములకు తానే హక్కుదారుడన్నట్లుగా ఉన్న జగన్ బొమ్మలపై పెయింట్ చేయడం లేదంటే ఉప్పుకాగితంతో తొలగించాలా అనేదానిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

వైసీపీ హయాంలో రీసర్వే వివరాలు..

డివిజన్	గ్రామాలు	ఎకరాలు
కడప	60	58,542.89
బద్వేలు	83	1,12,670.32
జమ్మలమడుగు	93	1,88,855.16
పులివెందుల	49	1,06,193.19

రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి కృషి..

భూముల రీసర్వేకు సంబంధించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నాం. గ్రామసభల్లో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్దేశిత గడువులోగా ప్రణాళిక ప్రకారం రీసర్వే చేసి పరిష్కరిస్తాం.

- మురళీ కృష్ణ, జిల్లా సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్



కడపలో రామ్‌చరణ్ సందడి

● పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
● రామ్‌చరణ్ చేతులమీదుగా ముషాయిరా ప్రారంభం
● ఆయనను చూసేందుకు ఎగబడ్డ అభిమానులు
● స్వల్పంగా పోలీసుల లాఠీచార్జ్



పెద్దదర్గా ఉరుసులో భాగంగా నిర్వహించిన ముషాయిరాలో పాల్గొన్న రామ్‌చరణ్

కడప కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీహీరో, మెగాస్టార్ చిరంజీవి తనయుడు కొణిదెల రామ్‌చరణ్ కడపలో సందడి చేశారు. సోమవారం సాయంత్రం 6-30గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్న రామ్‌చరణ్‌ను చూసేందుకు యువత పోటెత్తారు. దారి పొడవునా ద్విచక్రవాహనాలలో కేరింతలు కొడుతూ ఆయన కారువెంట వచ్చారు. రామ్‌చరణ్ మొదట బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ దంపతులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్‌ను చూసేందుకు అభిమానులు భారీగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో ఒకానొక దశలో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేశారు. అనంతరం ఆయన అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా)కు చేరుకున్నారు. అక్కడకూ అభిమానులు పెద్దసంఖ్యలో రావడంతో దర్గాప్రతినిధులు దర్గా గేట్లు మూసేశారు. అభిమానులను లోనికి వెళ్లనివ్వకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

పెద్దదర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో రామ్‌చరణ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చాదర్ సమర్పించి దర్గా విశిష్టత గురించి తెలుసుకున్నారు. ఉరుసు మహోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి దర్గాలో నిర్వహించిన ఆల్ ఇండియా 80వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా)ను రామ్‌చరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 సంవత్సరాల క్రితం తాను నటించిన మగధీర సినిమా రిలీజ్‌కు ముందు దర్గాను సందర్శించానని ఆ సినిమా సూపర్‌డూపర్ హిట్ అయిందన్నారు. ప్రఖ్యాత సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహమాన్ విజ్ఞప్తి మేరకు దర్గాకు వచ్చానన్నారు. ఆయన వెంట సినీ దర్శకుడు బుజ్జిబాబు ఉన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కడప అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్, నాయకులు తుంగా రమణయ్య, మాజీ నగర అధ్యక్షుడు మాలే శివ, అధ్యక్షుడు బోరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జీవీ రమణ,



చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు తాజ్ షరీఫ్, టీడీపీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జిలానీబాషాతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ముషాయిరాలో అరగంటకు పైగా ఉన్న తరువాత రామ్‌చరణ్ తిరిగి హైదరాబాదు వెళ్లిపోయారు.



కడపలోని విజయదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న రామ్‌చరణ్



విమానాశ్రయం వద్ద రామ్‌చరణ్ రాక సందర్భంగా అభిమానుల సందడి



చిత్రహింసలకు గురవుతున్నా.. ఇండియాకు రప్పించండి

● సౌదీలోని జిద్దా నుంచి కడపకు చెందిన మహిళ తీవ్ర రోదన

కడప క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాను చిత్రహింసలకు గురవుతున్నానని.. తనను ఇండియా రప్పించాలంటూ బతుకు తెరువుకోసం సౌదీ అరేబియాలోని జిద్దా వెళ్లి మోసపోయి అక్కడే బంగ్లాదేశీయుల వద్ద ఆశ్రయం పొందుతున్న కడపకు చెందిన షకీలా బేగం అనే బాధిత మహిళ ఓ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. వీడియోలో మహిళ ఆవేదనతో తెలిపిన వివరాలిలా..


"నేను కడపకు చెందిన మహిళను. నాకు భర్త, అమ్మానాన్న, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పులు చేసి నా ఇద్దరు కుమార్తెల వివాహాలు చేశాను. 9 నెలల క్రితం కడపకు చెందిన ఏజంటు రఫి, ముంబైకి చెందిన ఏజంటు షకీల్ అహ్మద్ నన్ను ఇండియా నుంచి సౌదీఅరేబియాలోని జిద్దా ప్రాంతంలో ఓ ఇంటికి పనికి పంపించారు. అక్కడ యజమానురాలైన షెరాని (70 సంవత్సరాల వృద్ధురాలు) నా తలపై కొట్టి, నా ఎడమ చేతిని కొరికింది. అక్కడ చేరిన ఐదు నెలలకే బయటకు తరిమివేసింది. తరువాత నేను ఎంబసీకి వెళ్లి ఎంత మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. నా బాధను వినేవారే లేరు. కడపకు చెందిన ఏజంటు రఫీ, ముంబైకి చెందిన ఏజంటు షకీల్ అహ్మద్ నన్ను రూ.5 లక్షలకు అమ్మేశారని, ఆ డబ్బులు కట్టాలని లేదంటే ఇండియాకు పంపేదే లేదని షెరాని చెబుతోంది. ఈ విషయం ఎంబసీ వారికి చెప్పినా నన్ను పట్టించుకోలేదు. మంత్రి లోకేశ్ నా బాధ ఆలకించి నన్ను ఈ నరకం నుంచి తప్పించి ఇండియాకు రప్పించాలని వేడుకుంటున్నా" అని బాధిత మహిళ కోరారు.

డ్వామా పీడీగా ఆదిశేషారెడ్డి

కడప రూరల్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వెయిటింగ్ లిస్టులో ఉన్న డీఎల్‌డీవో బి.ఆదిశేషారెడ్డిని కడప జిల్లా డ్వామా పీడీగా నియమించారు. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈయన మంగళవారం లేదా బుధవారం డ్వామా పీడీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదివరకు కడప జిల్లా జడ్పీ సీఈవోగా పనిచేసిన రమణారెడ్డిని సెప్టెంబర్ నెలలో ఆ పోస్టు నుంచి తప్పించి వెయిటింగ్ లిస్టులో ఉంచారు. ఆయనను ప్రస్తుత బదిలీల్లో కర్నూలు జిల్లా డీఎల్‌డీవోగా నియమించారు.

చిన్నారుల 'భవిత'కు బాసట
● భవిత కేంద్రాల సేవపై ప్రభుత్వ దృష్టి ● అండగా దాతలు 7

టమోటా రైతుకు తుంపర్ల దెబ్బ
● తోటల్లోనే రాలిపోతున్న టమోటాలు ● నష్టాల్లో రైతులు 6



దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

● కేంద్ర మంత్రి బీఎల్ వర్మ ● 1,235 మందికి దివ్యాంగులకు..

● రూ.1.73కోట్ల ఉపకరణాలు మంజూరు

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతి, సాధికారత కోసం భారత ప్రభుత్వం పాటుపడుతోందని కేంద్ర సామాజిక న్యాయం సాధికారత శాఖ మంత్రి బీఎల్ వర్మ పేర్కొన్నారు. 'సామాజిక్ అధికారత షివిర్' కార్యక్రమంలో భాగంగా సోమవారం జమ్మలమడుగులోని నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలులో ఏడీపీ ప్రత్యేక పథకం ద్వారా అలిమ్కో సంస్థ సౌజన్యంతో దివ్యాంగులకు నాణ్యమైన ఉపకరణాల పంపిణీ చేపట్టారు. దీనికి కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హాజరుకాగా.. వర్చువల్ ద్వారా కేంద్ర సామాజిక న్యాయం సాధికారిత మంత్రి ప్రసంగించారు. సమాజంలో దివ్యాంగులు కూడా ఒకరుగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా తీసుకురావడం గర్వించదగ్గ విషయమన్నారు. దివ్యాంగులను ఇతరులపై ఆధారపడకుండా చేయడం, వారిని గౌరవంగా ఉంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దేశంలోని 35 అంతర్జాతీయ, 55 డొమెస్టిక్ విమానాశ్రయాల్లో 709 రైల్వేస్టేషన్లు, 642 బస్టాండ్లలో రూ.29 కోట్లు వెచ్చించి ప్రత్యేకంగా దివ్యాంగులకు సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చామన్నారు. దేశంలోని 2.60 కోట్ల మంది దివ్యాంగుల విద్యార్థులకోసం రూ.879 కోట్లు వెచ్చించామన్నారు. వారి పునరావాసం కోసం రూ.830 కోట్లు ఖర్చు చేశామన్నారు. పారా ఒలంపిక్స్ కోసం దివ్యాంగులను ప్రోత్సహిస్తున్నామన్నారు. గతంలో 80శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి మాత్రమే ట్రైసైకిళ్లు ఇచ్చేవారని, ప్రస్తుతం దానిని 40 శాతానికి తగ్గించారన్నారు.

కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవ పరికరాలు, సహాయక ఉపకరణాలను అందించే బృహత్తర కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టిందన్నారు. ఎమ్మెల్యే చొరవతో జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో 1235 మంది దివ్యాంగుల జీవితాల్లో వెలుగు నింపుతోందన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగులు ఏ ఒక్కరు కూడా అసంతృప్తిగా జీవితం గడపకూడదనేదే కేంద్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, జిల్లా ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, అలిమ్కో డిప్యూటీ జీఎం సంజయ్‌సింగ్, ఆర్డీవో సాయిశ్రీ, డీఈవో మీనాక్షి, టీడీపీ మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ తదితరులు



సెట్టిగుంట ప్రాంతంలో వరి నారు సిద్ధం చేస్తున్న రైతులు

కోనసీమలా...

● కొద్దిసేపు ఎండ, వెంటనే వర్షం ● రైల్వేకోడూరులో భిన్న వాతావరణం


రైల్వేకోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో భిన్న వాతావరణం నెలకొంది. కొంచెంసేపు ఎండ... మళ్లీ వర్షం.. ఆపై మంచు కురుస్తూ ఊటీని తలపిస్తోంది. మరో కోనసీమగా పిలువబడుతున్న రైల్వేకోడూరు చల్లటి వాతావరణంలో విరాజిల్లుతోంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడ చూసినా పచ్చదనం ఉట్టిపడుతోంది. ఎప్పుడు వర్షం వస్తుందో, ఎప్పుడు ఎండ వస్తుందో అంతు పట్టని వాతావరణంలో రైల్వేకోడూరు ఉంది. వాటితో పాటు మంచు కురుస్తూ చల్లటి వాతావరణం ఉంటోంది. వర్షాలకు చెరువుల్లో 60 శాతం మేరకు వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు వరి నారు పోశారు. వరి నాట్ల పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రామాలమ్మకాలువ వద్ద నీరు ప్రవహించడంతో యువకులు సరదాగా ఈత కొడుతున్నారు. అడవుల్లోని వంకల్లో నీరు పారుతోంది. పచ్చదనంతో అడవులు అందాలను ఒలకబోస్తున్నాయి. చల్లటి వాతావరణంలో పక్షుల కిలకిలలతో చల్లటి గాలి పలకరింపులతో రైల్వేకోడూరులో ఊటీని తలపించే వాతావరణం ఉంది.



రామాలమ్మ కాలువలో ఈత కొడుతున్న యువకులు



నేను సైతం అంటూ పొలం పనుల్లో బాలుడు...



చల్లని వాతావరణంలో విద్యుత్ తీగలపై సేదతీరుతున్న పక్షులు



ఊటీని తలపించే విధంగా కురుస్తున్న మంచు

వీరభద్రాలయంలో గౌరీ పూజ





ప్రత్యేక అలంకరణలో అఘోరలింగేశ్వరుడు, గౌరీదేవి పూజ చేస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం గౌరీదేవి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్ఛారణల మధ్య కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని అఘోరలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గౌరీదేవి పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ పూజలకు రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు, కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్తీక దీపారాధన చేసిన అనంతరం గౌరీదేవి పూజలను నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ఈవో ఆధ్వర్యంలో మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమం చేశారు.

బీచ్ వాలీబాల్ జిల్లా జట్టు ఎంపిక

నందలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీచ్ వాలీబాల్ అండర్-19 బాలురు, బాలికల జట్టును నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని చెయ్యేరు ఒడ్డున ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఎంపికల్లో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. బాల బాలికల్లో ఇద్దరు క్రీడాకారులను మెయిన్ టీమ్‌కు ఎంపిక చేశామన్నారు. స్టాండ్‌బైలుగా రెండు టీమ్‌లకు నలుగురిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23న, 24 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫిజికల్ డైరెక్టర్ గణేష్‌బాబు సెలెక్టర్‌గా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో పీఈటీ జగన్, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారని తెలిపారు.

కోదండరాముడిని దర్శించుకున్న ఎస్పీ



కోదండరామాలయంలో ఎస్పీ దంపతులు

ఒంటిమిట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరాముడిని అన్నమయ్య జిల్లా ఎస్పీ, కడప జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతా రామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు ఆశీర్వాదం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టత చరిత్రను తెలియజేసి శిలాసంపదను వివరించారు. కోదండరాముడిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజునాయక్, అర్చకులు వీణారాఘవాచార్యులు, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక







ఎస్వీ రమణ చలపతి యోగానంద రెడ్డి

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 108 సర్వీసులకు చెందిన ఉద్యోగులు జిల్లా స్థాయిలో యూనియన్ ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు అనంతరం మొదటిసారిగా ఉద్యోగులు ఆదివారం సమావేశమై కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రామాంజులు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కలికిరికి చెందిన ఎస్వీ రమణ (పైలెట్), ప్రధాన కార్యదర్శిగా కలకడకు చెందిన సి.వెంకటాచలపతి (ఈఎంటీ), కోశాధికారిగా రాయచోటికి చెందిన యోగానంద రెడ్డి (ఈఎంటీ)లు ఎన్నికయ్యారని నూతన అధ్యక్షుడు ఎస్వీ రమణ తెలిపారు. మదనపల్లె, రాజంపేట, రాయచోటి డివిజన్లకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారని చెప్పారు. 108 సర్వీసు ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని చెప్పారు. ఈనెల 25 నుంచి 108 సర్వీసుల ఉద్యోగులు సమ్మె చేయనున్నట్లు ఇప్పటికే అధికారులకు నోటీసులందజేసిన విషయం తెలిసిందే.

సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికంగా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి. ఎప్పుడు వచ్చాయి. ఫీల్డ్‌కు వెళ్లారా, విచారణ చేశారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమస్య వచ్చిన మరుసటిరోజు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేసి అర్జీదారులతో కలిసి ఫొటో దిగాలని, ఏదైనా నోటీసు ఇవ్వాల్సిన అవసరం ఉంటే నోటీసు ఇచ్చి గడువు తర్వాత ఆ సమస్య తమ పరిధిలో ఉంటే తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పైస్థాయికి వెళ్లాల్సి ఉంటే ఆ విషయాన్ని అర్జీదారులకు స్పష్టంగా వివరించి తగిన ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులందరూ కూడా వారి శాఖలకు సంబంధించిన వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

జిల్లాలోని పశువులకు వంద శాతం బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధిని నిర్మూలించి ఆర్థిక ప్రగతిని సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని నివారణకు టీకాలు ఒకటే మార్గమన్నారు. పశు వైద్యశాలల్లో లేదా పశుపోషకుని ఇంటి వద్దనే సంవత్సరానికి మూడు విడతలుగా ఉచితంగా టీకాలు వేయాలని సూచించారు. 4-8 నెలల వయస్సు గల పేయ దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్డీసీ రామసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టమోటా రైతుకు తుంపర్ల దెబ్బ

● తోటల్లోనే రాలిపోతున్న టమోటాలు
● నష్టాల బాటలో రైతన్నలు
● నాణ్యతా లోపంతో ధరలు పతనం



తుంపర్లకు దెబ్బతిన్న టమోటా తోట

గుర్రంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు సాగు చేసిన పంటలకు దెబ్బ మీద దెబ్బపడుతూనే ఉంది. దీంతో పంటలు నష్టపోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నాడు. పంటలు బాగా పండిన సమయంలో ధరలు లేకపోవడం, సాగు చేసిన పంటకు ధరలున్న సమయంలో దిగుబడి రాకపోడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. దీనికి తోడు ప్రకృతి కూడా రైతన్నపై చిన్న చూపు చూస్తోంది. రైతన్నల కష్టాలు తీరుతాయనకున్న సమయంలో వరుణుడు దెబ్బ రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో దిగుబడి పొందకుండానే కాయలు నేల రాలిపోతున్నాయి. పంట సాగు ఖర్చు చేసిన పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేక రైతులు విలవిల్లాడుతున్నారు.

పడమటి మండలాల్లో రైతన్నలు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తారు. ఈ టమోటా పంట ఎకరా పొలంలో సాగు చేయాలంటే రైతుకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుంది. టమోటా పంట నాటింది మొదలు దిగుబడి వచ్చే వరకు ఎకరా పొలానికి రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుంది. టమోటా పంటకు ధరలున్న సమయంలో రైతులు ఆదాయం పొందుతున్నారు. ధరలు పతనమైన సమయంలో అప్పుల బాటలో పయనిస్తున్నారు. అయితే కొన్ని నెలలుగా టమోటా పంటకు ఆశాజనకంగా ధరలున్నాయి. ఈ క్రమంలో పడమటి మండలాల్లో రైతులు వేలాది ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు కిలో రూ.25 నుంచి 30 వరకు పలుకుతున్నాయి. 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.500 నుంచి 700 వరకు పలుకుతోంది. ఈ ధరలున్న రైతులు పంట సాగు ఖర్చులు పోనూ కొంత మేర అప్పుల నుంచి బయటపడతారు. ఈ క్రమంలో నాలుగు రోజుల పాటు కురిసిన తుంపర్లకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో తోటల్లోనే కాయలు రాలిపోతున్నాయి.

నాణ్యత లోపంతో ధరలు పతనం..

ఇటీవల కురిసిన తుంపర్లకు టమోటా పంటలు దెబ్బతిన్నాయి. ఈ తుంపర్లకు టమోటా తోటల్లో ఆకులు రాలిపోయి కాయలపై నల్లమచ్చలు ఏర్పడ్డాయి. టమోటా కాయలకు మచ్చలు రావడంతో మార్కెట్‌కు తీసుకెళ్లినా కొనేవారు తక్కువ ధరకు అడుగుతున్నారు. నాణ్యత ఉన్న కాయలకు మంచి ధరలుంటే మచ్చలున్న కాయలు సగం ధర కూడా పలకడం లేదు. దీంతో పంట దిగుబడి ఉన్న రైతులు తుంపర్ల దెబ్బకు తీవ్రంగా నష్టపోయారు.



తోటలోనే రాలిపోయిన టమోటాలు

తుఫాన్‌తో నష్టపోయా...

పొలం లీజుకు తీసుకుని ఆరు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశా. ప్రస్తుతం పంట దిగుబడి ప్రారంభమైంది. పంట సాగుకు సుమారు 15 లక్షలు ఖర్చు చేశా. ఈ క్రమంలో తుఫాన్ కారణంగా కురిసిన తుంపర్లకు టమోటా పంట పూర్తిగా దెబ్బతింది. తుంపర్లతో కాయలు దెబ్బతిని నేల రాలిపోయాయి. తోటలో ఉన్న కాయలు కూడా నాణ్యత లేకపోవడంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంట సాగుకు చేసిన పెట్టుబడులు కూడా చేతికందేలా లేవు.

-ప్రభాకర్, టమోటా రైతు, గుర్రంకొండ

వైరస్‌తో కాయల్లో నాణ్యత లేదు

ఇటీవల కురిసిన అరకొర వర్షంతో టమోటా పంటలకు చీడపీడలు ఎక్కువయ్యాయి. దీంతో పంటలో కాయలు నాణ్యత లోపించకుండా ఉండడానికి వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. ఇంత చేసినా కాయలపై మచ్చలు ఏర్పడుతన్నాయి. దీంతో మచ్చలు పడిన కాయలను మార్కెట్‌లో వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాము.

- ఎస్.శ్రీనివాసులు, రైతు, ఎల్లుట్ల, గుర్రంకొండ

నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదులను సంబంధించిన పోలీసు అధికారులకు బదిలీ చేసి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే బాధితులు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తమ వెంట తీసుకుని రావాలని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ శాఖాధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిరుతపులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో మదనమోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి చల్లావారిపల్లి గ్రామంలో చిరుతపులి సంచరించడంతో చిరుతపులి గుర్తుల కొరకు అన్వేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో నిత్యం చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే గ్రామంలో ఒక ఆవు, పారేసువారిపల్లిలో మేక చిరుతపులి దాడిలో మరణించాయని తెలిపారు.

రాత్రి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒక వేళ చిరుతపులి కనిపిస్తే వెంటనే అటవీ శాఖాధికారుకు తెలియచేయాలన్నారు. రెండు రోజుల క్రితం చలిమామిడికొండపై చిరుతపులి కనిపించిందని కొందరు గ్రామస్తులు ఆయనకు తెలిపారు. అనంతరం చిరుతపులి వెళ్లిన మార్గంలో వాటి అడుగుజాడల కొరకు వెతికారు. త్వరలోనే చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో దీప, ఏబీవో హరి, మాజీ సర్పంచ్ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పులివెందుల పశు సంవర్ధక పరిశోధనా కేంద్రం సీఈవో బదిలీ

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పులివెందులలోని ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్ (ఏపీసీఏఆర్ఎల్) కేంద్రం సీఈవో డాక్టర్ వై.రమణారెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు వెటర్నరీ సైన్స్ కాలేజీ అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాస ప్రసాద్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. బదిలీ చేసిన రమణారెడ్డికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనే విషయం ప్రభుత్వం స్పష్టంగా చెప్పనప్పటికీ తదుపరి నియామకం కోసం ఆయనను తిరుపతి ఎస్వీయూకు కేటాయించారు.

చిన్నారుల 'భవిత'కు బాసట

ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బోధకులకు, పిల్లలకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో వివిధ రకాల వైకల్యంతో ఉన్న చిన్నారులు పలు సేవలకు దూరమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం ఫిజియోథెరపి సేవలను పునరుద్ధరించడంతోపాటు వివిధ అంశాలపై దృష్టి సారిస్తోంది. చిన్నారుల భవితకు బాటలు వేస్తోంది.

- భవిత కేంద్రాల సేవపై ప్రభుత్వం దృష్టి
- అండగా దాతల సహకారం

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 352 ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం తరుపు భవిత కేంద్రం నడుస్తుండగా ప్రభుత్వేతర సంస్థ వికాస్ విహార్‌లో చిన్నారులకు విద్యాబుద్దులతోపాటు పలు రకాల సేవలు అందుతున్నాయి. భవిత కేంద్రంలో సుమారు 30 మంది పిల్లలు ఉన్నారు. వీరికి విద్యను అందించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు సంగీత (మేథోవైకల్యం), లక్ష్మిరెడ్డి (స్పీచ్ థెరపి) చెవిటి, మూగ పిల్లలకు సేవలు అందిస్తున్నారు. సాధారణ కదలికలు, కండరాల్లో వైకల్యం, మెదడు అభివృద్ధి లోపం, నరాల బలహీనత బారిన పడిన పిల్లలకు ఈ కేంద్రంలో ఫిజియోతెరఫి సేవలు అందుతున్నాయి. ఫిజియోథెరపిస్టు ఉస్మాన్ అలి వారంలో ఒక రోజు కండర వ్యాయామాలు చేయిస్తున్నారు.

భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాను, పోను రవాణా, అంగరక్షక భత్యాలు వేరువేరుగా నెలకు రూ.300 చొప్పున ఇవ్వాలి. బాలికలకు ప్రత్యేక భత్యాలు, రీడర్ అలవెన్స్, హెచ్‌పీ అలవెన్స్, స్పీచ్ తెరపి, కళ్లజోళ్లు, ఎంఆర్ కిట్లు సమకూర్చాల్సి ఉంది. అంతేకాకుండా బిహేవియర్ మాడిఫికేషన్, విచిత్ర ప్రవర్తన అదుపునకు కృషి, ఐక్యూ స్ర్కీనింగ్, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తూ విద్యాబోధన సాగిస్తున్నారు. మానసిక వికలాంగులు అయినప్పటికి వారిలో చదవడం, రాయడం, సంఖ్యల గుర్తింపు, లెక్కింపు, డబ్బుల లెక్కింపు, నిత్యజీవితంలో అవసరమైన పనులు, స్వతహాగా చేసుకోవడం, సమాజాన్ని అర్థం చేసుకుని పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి విద్యార్థి తన పేరు, చిరునామా, ఇంగ్లీషులో సంతకాలు చేసి మేము సైతం అన్నట్లుగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని అక్కడి బోధకులు వివరిస్తున్నారు. ఈఏడాది 10వ తరగతి పరీక్షలకు తమ కేంద్రం నుంచి ఆరుగురు విద్యార్థులు క్రైట్ సహకారంతో హాజరయ్యేలా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైకల్య సమస్య అదికంగా ఉండి భవితకేంద్రం వరకు రాలేని పిల్లలకు ఇంటికి వెళ్లి విద్యను అందించడంతోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.



ఆట వస్తువులతో చిన్నారులకు విద్యాబుద్ధులు

దాతల దాతృత్వం

భవిత పాఠశాల ఆవరణలో రూ.40వేల వ్యయంతో తాళ్లమాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు కే.శే శివరామయ్య ఫ్లోరింగ్ వేయించారు. టీవీఆర్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి వేడి, చల్లని నీరు అందించే వాటర్ కూలర్‌ను విరాళంగా ఇచ్చారు. వైసీపీ నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి రూ.80వేల వ్యయంతో పాఠశాలకు ఇనుప గ్రిల్స్ వేయించారు. హర్షా ఆస్పత్రి వారు పాఠశాల ఆవరణానికి రూ.15 వేలు వ్యయంతో పిట్టగోడ నిర్మాణం చేయించారు. దాతలు, స్వచ్ఛందంగా ముందుకొచ్చి దివ్యాంగులకు పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంగా రోజుకు ఒకరు దాతృత్వంతో అందిస్తున్నారని వివరించారు. మానవతా, ఆదరణ సేవా సంస్థల సభ్యులు భవిత పాఠశాలకు సహాయ సహకారాలు అండగా నిలిచాయని తెలిపారు. రవాణా భత్యాలు అరకొరగా అందుతుండడంతో పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లే రెండు ఆటోలకు గాను ఒక దానికి బాడుగను తల్లిదండ్రులు చెల్లిస్తున్నారని, మరో ఆటోకు ప్రతినెల బాడుగ ఆదరణ సేవా సంస్థ సభ్యులు అందిస్తున్నారని వివరించారు. పిల్లలకు చెల్లించాల్సిన భత్యాల విషయమై 'ఆంధ్రజ్యోతి' సమగ్ర శిక్షా ఐఈ కోఆర్డినేటర్ కేశవరెడ్డిని వివరణ కోరగా రవాణా భత్యాలతోపాటు పిల్లలకు అందాల్సిన వివిధ భత్యాలు సకాలంలో అందజేస్తున్నామని తెలిపారు.



స్పీచ్ థెరపి చేయిస్తున్న ఉపాధ్యాయుడు



నడక సాధన చేస్తున్న చిన్నారి

క్రీడల్లో గెలుపోటములు సహజం



చాంపియన్‌గా నిలిచిన జట్లతో క్రీడా పోటీల జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ

లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని.. ఓడిపోయినా కుంగిపోవాల్సిన అవసరం లేదని.. ఓటమి గెలుపునకు నాంది అని రాయలసీమ స్థాయి క్రీడా పోటీల జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ అన్నారు. మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాలలో 14 నుంచి జరుగుతున్న రాయలసీమ స్థాయి జోన్-4 క్రీడలు సోమవారం ముగిశాయి. అన్ని క్రీడా పోటీల్లో సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌గా వెల్లాల, వాలీబాల్ పోటీల్లో చాంపియన్‌గా వాల్మీకిపురం జట్లు నిలిచాయ. తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంఈఓ రామకృష్ణయ్య, ప్రిన్సిపల్ సత్యవతమ్మ, కోఆర్డినేటర్ నాగవేణిలు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ద గురుస్వామి ఆరాధన



విజేతగా నిలిచిన వృషభరాజముల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న సర్పంచు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది కార్తీకమాసంలో జరిగే జగద్గురు సిద్ద గురుస్వామి ఆరాధన మహోత్సవాలు విశేషంగా తరలవచ్చిన భక్తుల సమక్షంలో వైవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సిద్దగురుస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.50వేలను సర్పంచు గంగిరెడ్డి, టీడీపీ నేత రఘునాథరెడ్డిలు అందించారు.

హుండీల లెక్కింపుతో రూ.18లక్షల ఆదాయం

చక్రాయపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించగా రూ.18,77,680 ఆదాయం వచ్చింది. అలాగే అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.27771 వచ్చింది. మిక్స్‌డు బంగారు వస్తువులు 14 గ్రాములు, మిక్స్‌డు వెండి 460 గ్రాములు, కువైట్ దినార్ ఒకటి వచ్చింది. దాదాపు 74 రోజులకు గాను ఈ మొత్తం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి, దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ఏపీజీబ్యాంకు మేనేజర్ భానుచంద్ర, పోలీసులు హాజరైనట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష వితరణ



కలెక్టర్ శ్రీధర్‌కు చెక్కును అందజేస్తున్న బాలాజీ హైస్కూలు విద్యార్థినులు

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల బాధితుల సహాయార్థం జమ్మలమడుగు బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి సీఎం సహాయ నిధికి రూ.లక్ష వితరణగా అందించారు. సోమవారం జమ్మలమడుగులో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, **డీఈవో మీనాక్షి** సమక్షంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విజయవాడ వరదల బాధితులకు సాయంగా పాఠశాల తరుపున విద్యార్థులు సేకరిం చిన లక్ష రూపాయలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో ప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన రామాంజులు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం చెలకలనేర్పు సమీపంలోని తులగనూరుకు చెందిన రామాంజి (38) అతని భార్య లక్ష్మీదేవి (35), కుమారుడు నిఖిల్ (10) తమ స్వగ్రామం నుంచి బాగేపల్లె సమీపంలోని పాతపాళ్యంకు బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈక్రమంలో చెన్నరాయునిపల్లె క్రాస్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చెన్నరాయునిపల్లెలోని వారి బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ రామాంజిని ప్రైవేటు అంబులెన్స్‌లో బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రామాంజి భార్య కుమారుడిని చికిత్స నిమిత్తం చింతామణికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.

వరకట్నం కోసం వేధించిన వ్యక్తికి జైలుశిక్ష

పులివెందుల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరకట్నం కోసం వేధించిన వ్యక్తికి ఐదు సంవత్సరాలు కారాగార శిక్ష మరియు మూడు లక్షల తొమ్మిదివేలు జరిమానాను సోమవారం కడప ఏఎస్‌జె కోర్టు విధించింది. గూడుబాయి అల్లాబకాష్ తన ఏకైక కుమార్తె రేష్మాను పులివెందుల పట్టణం జెండామాను వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా కుమారుడు మహ్మద్‌రఫికి ఇచ్చి 19.10.2008లో కట్నం కింద 22 తులాల బంగారు, రూ.2లక్షలు నగదు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. రఫీ తాగుడుకు బానిసై ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతూ అదనపు కట్నం కోసం వేధించేవాడు. అతని వేధింపులు భరించలేక రేష్మా 01.02.2018న రాత్రి సుమారు 10.45 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులకు ఫోను చేసి తన భర్త మరియు అత్తమామలు తనను కొడుతూ వేధిస్తున్నారని, తాము చనిపోతున్నానని చెప్పి ఇంటిపైకప్పుకు ఉరి వేసుకుని చనిపోయింది. మృతురాలి సోదరుడు హబీబుల్లా ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ గోపినాధరెడ్డి క్రైం నెం.49/2018 యు/ఎస్ 498(ఎ) 306, ఆర్/డబ్ల్యు, 34 ఐపీసీ మరియు సెక్షన్ 3 మరియు 4 కింద కేసు నమోదు చేవఆరు. ఫిర్యాదుపై విచారించి అప్పటి పులివెందుల సీఐ కె.,పుల్లయ్య ముద్దాయిని అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసును విచారించిన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి నేరం రుజువు కావడంతో మహ్మద్‌రఫికి ఐదేళ్లు సాధారణ జైలుశిక్ష మరియు రూ.3.9 లక్షలు జరిమానా, చెల్లించని యెడల ఒక సంవత్సరం శిక్ష విధించారు.

అదుపుతప్పి కారు బోల్తా..

ఇరువురికి తీవ్రగాయాలు



గాయపడిన వెంకటరమణ, ప్రసాద్

రైల్వేకోడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. రైల్వేకోడూరు మండలంలోని తురకపల్లె వద్ద డబుల్ రోడ్డు పనులు సాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి రైల్వేకోడూరు నుంచి చిట్వేలి మండలంలోని నేతివారిపల్లెకు ఓ కారు వెళుతుండగా ముందు వెళుతున్న మరో కారును తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మన్నెం వెంకటరమణ, ప్రసాద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే ఇద్దరు ఇరుక్కుపోగా.. స్థానికుల సాయంతో బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.

రూ.1.90 లక్షల నగదు చోరీ

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని సంజాముల మోటులో సోమవారం మధ్యాహ్నం రూ.1.90 లక్షలు నగదు చోరీ జరిగింది. పెద్దముడియం మండలం భీమగుండం గ్రామానికి చెందిన మోపూరి శివవెంకటసుబ్బరాయుడు మధ్యాహ్నం కెనరా బ్యాంకు నుంచి రూ.1.90 లక్షలు నగదు డ్రా చేసుకున్నాడు. పంటకు వాడే పురుగుల మందుతో పాటు డబ్బులను కట్టెల బ్యాగులో పెట్టుకుని మోటారు బైక్‌కు తగిలించుకుని సంజాముల మోటు వద్దకు వచ్చాడు. అక్కడ కూరగాయల దుకాణం వద్దకు వెళ్లి కూరగాయలు కొనేలోపు గుర్తు తెలియని వ్యక్తులు నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

రాష్ట్ర ఆదర్శ గురువులకు వైవీయూ సత్కారం



రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులను సత్కరిస్తున్న వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ప్రొఫెసర్లు వీరాంజనేయరెడ్డి, ఎం.అనిత, విజయభారతిలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు పద్మ ఘనంగా సత్కరించారు. వైవీయూలో జరిగిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల అభినందన కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ అవార్డుగ్రహీతలైన ఎల్‌వీ రెడ్డి దేశంలోని టాప్2లో ఒకరిని, డీఎస్సీ, స్విఫ్ట్, యూజీసీ పొంది పరిశోధనలో ముందుకు వెళుతున్నారని అభినందించారు. ప్రొఫెసరు అనిత తక్కువ వనరులను వినియోగించుకుని రాయలసీమ ప్రయోజనాల కోసం పరిశోధనలు చేస్తున్నారన్నారు. ప్రొఫెసరు విజయభారతి అకడమిక్ పరిశోధనల పరంగా అభివృద్ధిపథంలో ముందున్నారన్నారు.

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాలలో... : కడపనగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలుగా అవార్డు పొందిన అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ విజయలక్ష్మీదేవిని ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్‌షాజియా, డాక్టర్ శచీదేవి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ క్రిష్ణవేణిలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

కడప (క్రైం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుండి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్దులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా భానుతేజ



గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్జీఎఫ్ అండర్-19 బాలబాలికల అంతర జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన డి.భానుతేజ స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా ఎంపికయ్యారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జిల్లా నిలిచింది. విజేతలకు వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.దామోదరరావు బహుమతులను అందజేశారు. జిల్లా కార్యదర్శి రవి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి నరేంద్ర, అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడకా ప్రసాద్, స్టేడియం కమిటీ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ విద్యార్థుల ప్రతిభ



మనోజ్‌ను అభినందిస్తున్న వీసీ విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైవీయూలో జరిగిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్ పోటీలలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ విద్యార్థులు ప్రతిబ కనబరిచారని వైస్‌చాన్సలర్ విశ్వనాధకుమార్, రిజిస్ట్రార్ ఎస్.రాజేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌ఏయూలో యానిమేషన్ మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్ మనోజ్ మొబైల్ ఫొటోగ్రాఫ్ విభాగంలో మొదటి బహుమతి లభించింది. ఈ విద్యార్థిని వైస్‌చాన్సలర్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ పరమశివం, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటరు సుజాత, రవికుమార్ పాల్గొన్నారు.

'పనివేళల మార్పుతో కొత్త సమస్యలు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పనివేళల్లో మార్పు చేయడం ద్వారా కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున తెలిపారు. సోమవారం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు పనివేళలను పెంచాలని ప్రభుత్వం భావించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న పనివేళల్లో ఎటువంటి ఇబ్బందులు లేవని మార్పులు చేయడం వల్ల కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. విద్యార్థులు మానసిక స్థితిపై ప్రభావం చూపుతుందన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, సుదర్శన్‌బాబు, గంగరాజు, రాజాబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల చాంపియన్ కడప



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలో కడప జిల్లా క్రీడాకారులు ప్రథమస్థానం, రన్నరప్‌గా తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు దక్కించుకున్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 350మందికి పైగా వచ్చారు. పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. పోటీల అనంతరం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అబ్దుల్‌సలాం మాట్లాడుతూ ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి డిసెంబరు 2వరకు హర్యానాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యల్‌టీ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్, బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల వద్ద సీపీఐ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. సోమవారం స్థానిక సచివాలయం వద్ద జరిగిన ఆందోళనలో వారు మాట్లాడారు. సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, గంగాసురేశ్, మల్లికార్జున, శంకర్‌నాయక్, భాగ్యలక్ష్మి, బ్రహ్మం, నారాయణ పాల్గొన్నారు.

హామీని అమలు చేయాలి: సీపీఐ

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కడప నగరం 48వ డివిజన్ సచివాలయంలో అధికారులకు అర్జీదారులు అందజేశారు.

అనాథలకు వస్త్ర, అన్నదానం


బట్టలు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ లెక్చరర్ మీగడ రామమునిరెడ్డి తదితరులు

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెకు చెందిన రిటైర్డ్ లెక్చరర్ అయ్యప్ప గురుస్వామి మీగడ రామమునిరెడ్డి అనాథలకు బట్టలు పం పిణీ చేసి అన్నదానం చేశారు. 36 సంవత్సరాలు అయ్యప్పమాల ధరించిన సందర్భంగా సోమవారం రాజీవ్‌నగర్ కాలనీలోని అనాథాశ్రమంలో వృద్ధులకు అందించారు. అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు.

నేడు ఆర్సీపీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమలో ఉన్న వివిధ సంస్థలను అమరావతికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్సీపీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, కార్యదర్శివర్గ సభ్యుడు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉదయం 11గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఉంటుందని ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు.

ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి: కమిషనర్


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ పరిధిలో ప్రజలు తెలిపిన ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్‌హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 28 అర్జీలు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 13, టౌన్‌ప్లానింగ్ 6, రెవెన్యూ 6, హెల్త్ విభాగం 3 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను పరిశీలించి సం బంధిత శాఖాధికారులకు పంపించామన్నారు. ప్రతి అర్జీని సమయపాలన పాటించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. అడిషనల్ కమిషనర్ రాకేశ్‌చంద్రం, డిప్యూటీ కమిషనర్ రాంబాబు, ఈఈ ధనలక్ష్మి, నారాయణస్వామి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో రూ.5 లక్షల ప్రమాద బీమా

కమలాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం తీసుకున్న వ్యక్తి కుటుబానికి రూ.5లక్షలు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందని 12వ వార్డు కౌన్సిలరు బాబుల్ అన్నారు. సోమవారం నగర పంచాయతీలోని బీడీకాలనీ 20వ బూత్‌లో బాబుల్ ఆధ్వర్యంలో సభ్యత్వం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ టీం సభ్యులు బాబా ఫకృద్దీన్, నరసింహాచారి పాల్గొన్నారు.

మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రమాణ స్వీకారం


ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ శ్రీదేవిని అభినందిస్తున్న మల్లేశ్

కడప(వినాయకనగర్), నవంబరు18(వినాయకనగర్): మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎన్నికైన గన్నెపాటి మల్లేశ్ సోమవారం విజయవాడలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, ప్రిన్సిపల్ సెక్రటరీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గన్నెపాటి మల్లేశ్ ఫోన్‌లో మాట్లాడారు. మాదిగల ఆర్థికాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎంతో వెనుకబడిన మాదిగల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఉండవల్లి శ్రీదేవికి బొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు.

హర హర మహాదేవ..శంభో శంకర


చెన్నూరు కాశీవిశ్వేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కడప: మృత్యుంజయ కుంటలో కొలువుదీరిన శివయ్య


కమలాపురం: చదిపిరాళ్లలో భక్తుల పూజలు


సంగమేశ్వరంలో స్వామివారు



సీకేదిన్నె: ఉమామహేశ్వర ఆలయంలో పూజలు.. పులివెందులలో కార్తీక పూజలు

కడప కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివాలయాలన్నీ భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు కుటుంబ సమేతంగా జనం హాజరయ్యారు. కార్తీకదీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కడప నగరంలోని మృత్యుంజయకుంటలో వె లసిన మృత్యుంజయేశ్వర స్వామి దేవాలయం, నబీకోట శివాలయం, మోచంపేట శివాలయం, దేవునికడప శివాలయం, గడ్డిబజారులో వెలసిన బాలాజీ ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

కార్తీకం.. పరమపవిత్రం

చెన్నూరు: కార్తీక మాసం పరమపవిత్రం. ఈ మాసంలో చేసే ప్రతి పూజ పాపాలను హరించి పుణ్యం ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. మూడోసోమవారం సందర్భంగా చెన్నూరు మల్లేశ్వరాయలం, దక్షిణ కాశిగా పేరొందిన శివాలపల్లె కాశీవిశ్వేశ్వరాలయం, ఉప్పరపల్లె నాగలింగేశ్వరాలయం, నాగేశ్వరాలయాల్లో పూజలు చేశారు.

వల్లూరు: పుష్పగిరి క్షేత్రంలో కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ సంతాన మల్లేశ్వరులను భక్తులు దర్శించుకున్నారు. భవానీశంకర ఆలయంలో రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే భవానీ అమ్మవారిని పండ్లతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం మహా మంగళహారతి చేపట్టారు. కమలాపురం రూరల్:చదిపిరాళ్ల శివాలయం శివనామస్మరణలతో మార్మోగింది.

ఘనంగా శివపూజ

కడప కల్చరల్: బాలాజీనగర్ కీర్తి ఎన్‌క్లేవ్‌లో హిమలింగానికి శివపూజ ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ అద్దె బ స్సుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాలగిరి భాస్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

శైవక్షేత్రాల్లో కార్తీక శోభ

పులివెందుల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఓం నమశ్శివాయ అంటూ భక్తుల నామస్మరణతో శివాలయాలు మారుమోగాయి. ఎర్రంరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన హరినారాయణ స్వామి వారి ఆలయంలో జన జాతర తలపిస్తూ ప్రత్యేక దీపోత్సవాలు జరిగాయి. ఆలయ అర్చకులు హరినారాయణస్వామికి ఏకరుద్రాభిషేకాలు, బిల్వార్చనలు పూజలు అందుకున్నారు. అలాగే పులివెందుల పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది.



'అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లను సస్పెండ్ చేయాలి'


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళితుల భూములను అగ్రవర్ణాల వారికి కట్టబెట్టిన తహసీల్దార్లను వెంటనే సస్పెండ్ చేయాలని మాల మహానాడు జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు రామాంజి ఇమ్మానియేలు, తాళ్లపాక వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద గల అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలంలో వందలాది ఎకరాల భూములను అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగా ఈశ్వరయ్య అనే తహసీల్దార్‌ను సస్పెండ్ చేశారే కానీ ఆన్‌లైన్ రద్దు చేయలేదన్నారు. అలాగే ప్రొద్దుటూరు తహసీల్దార్ సాగించిన అవినీతి, అక్రమాలు, ప్రస్తుత అట్లూరు తహసీల్దార్‌గా సేవలందిస్తున్న అధికారిణి సుమారు 250 ఎకరాలను పెత్తందారులకు కట్టబెట్టిన వైనంపై నిప్పులు చెరిగారు. అలాగే మైదుకూరు మండలంలో జరిగిన భూ దోపిడీపై విచారణ చేపట్టాలన్నారు. అంతేకాకుండా చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, కడప, ఖాజీపేట, తదితర మండలాల తహసీల్దార్ల భూ అక్రమాలపై సీబీఐచే ఆరా తీయాలన్నారు. లేని పక్షంలో ముఖ్యమంత్రి కార్యాలయం ఎదుట భారీ నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు వెంకటరమణ, ఉల్లి కిరణ్, సి.కె. కుమార్, రాయలసీమ అధ్యక్షుడు ఓబులేసు, పి. సుధాకర్ (ఆళ్లగడ్డ) మహిళా నాయకురాలు బి. నిత్యమ్మ, పి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

'తపోవనం ఆశ్రమంపై ఆంక్షలు తగవు'


సహాయ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చక్రాయపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్ని నదీతీరాన ఉన్న ప్రేమానంద ఆశ్రమం తపోవనంపై గండి అధికారులు ఆంక్షలు విధించడం తగదని బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. తపోవనం బోర్డును తొలగించినందుకు సోమవారం నిరసన తెలిపారు. ఈ నిరసనలో గాలి హరిప్రసాద్, లక్ష్మిరెడ్డి, దశరథ, పవన్‌కుమార్, సతీష్, శ్రీనివాసులుపాల్గొన్నారు.

ఆదాయ వనరుల సర్వే పక్కాగా నిర్వహించాలి


వేముల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా మహిళల ఆదాయ వనరుల వివరాల సర్వేని పక్కాగా నిర్వహించాలని వెలుగు ఏపీఎం ఆంజనేయులు సూచించారు. సోమవారం శ్రీశక్తి భవన్‌లో వెలుగు సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆదాయ వనరులను, వారి కుటుంబ సభ్యులు ఆదాయ వనరులను సంక్షిప్తపరచాలన్నారు. బ్యాంకు లింకేజీ అర్హత కలిగిన ప్రతి స్వయం సహాయక సంఘానికి రూ.20లక్షల వరకు రుణ వసతి కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.


ఘనంగా భక్త కనకదాస జయంతి

పులివెందుల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ కళాశాలలో దాస సాహితీ మహోన్నతుడు శ్రీభక్త కనకదాస జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శేష మహేశ్వరమ్మలు మాట్లాడుతూ తన కీర్తనల ద్వారా సమాజంలోని అసమానతల్ని రూపుమాపేందుకు శ్రీకనకదాస కృషి చేశారన్నారు. కనకదాస కృషిని గుర్తుచేసుకోవడం ఎంతో అవసరమన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

వల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో గ్రామ దేవత గంగమ్మ, దత్తాత్రేయ స్వామి ప్రతిష్ఠామహోత్సవాలు మూడోరోజైన సోమవారం ఘనంగా జరిగాయి. వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠ నిర్వహించారు. ముందుగా యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ చేపట్టారు. మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మహాపూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.


కడప పెద్ద దర్గాకు వచ్చిన సినీ నటుడు రామ్‌చరణ్‌తో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్







కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి

● ఫిబ్రవరిలో 'చలో ఢిల్లీ'


కడప నాగరాజుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని సోమవారం పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు విద్రోహ దినం పాటించారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఈపీఎస్ పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నిత్యావసర సరుకులు మొదలుకుని గ్యాస్, పెట్రోలు, డీజలు ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో రూ. వెయ్యి పెన్షన్ ఇస్తే ఎలా అన్నారు. ఈ మేరకు ఫిబ్రవరిలో ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. వామపక్ష కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, నాగసుబ్బారెడ్డి, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ నాయకుడు కళ్యాసుధాకర్, విద్యుత్ కార్మిక సంఘం నాయకుడు సుదర్శన్‌రెడ్డి, యూపీఎఫ్ టీచర్స్ నాయకుడు లక్ష్మీరాజా, డీసీసీ పెన్షనర్స్ నేత బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌బిల్డింగ్ సొసైటీలో సహకార వారోత్సవాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సహకార రంగంలోని గృహ నిర్మాణ సొసైటీ ద్వారా సంఘంలోని సభ్యుల గృహ నిర్మాణానికి ఎంతో ఉపయోగం కలుగుతుందని సీటీసీ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కడప హౌస్ బిల్డింగ్ సంఘంలో సోమవారం 71వ జాతీయ సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై ఆయన మాట్లాడారు. సబ్ డివిజనల్ సహకార అధికారి సత్యానందం మాట్లాడుతూ కడప హౌస్ బిల్డింగ్ సొసైటీ శత వసంతాలకు దగ్గరలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శేషారెడ్డి, అసిస్టెంటు రిజిస్టరు సుభాష్ చంద్ర బోస్, సహకార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరవుతాయని ఎంపీడీఓ కుళాయమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో సోమవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. అర్హులైన వారు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్‌కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ ఉన్న ఫోన్‌ను తీసుకెళ్లాలన్నారు.



24న నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికినాగేశ్వరావు తెలిపారు. 24వ తేదీ ఆదివారం సాయంత్రం వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఉద్యానవనంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో అమ్మవారికి అష్టోత్తర శతనామార్చన జరుగుతుందని తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రాజోలి జలాశయం నిర్మించండి.. ఎమ్మెల్యే పుట్టా



మైదుకూరు రూరల్,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కుందూనదిపై రాజోలి జలాశయం నిర్మించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు.విజయవాడలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో సోమవారం పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రాజోలి జలాశయం నిర్మాణం కోసం గతంలో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి ఇద్దరూ శిలాఫలకాలు వేశారు కానీ పట్టించుకోలేదన్నారు.కూటమి ప్రభుత్వంలో జలాశయ నిర్మాణం పూర్తి చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. రాజోలి జలాశయ నిర్మాణం పూర్తి అయితే మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప, కమలాపురం సస్యశ్యామలం అవుతాయని పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు.

పంటలపై మంచు దుప్పటి

ఆందోళనలో అన్నదాతలు

రాజుపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐదురోజులుగా తుఫాన్ ప్రభావంతో అరకొర వర్షాలు పడుతున్న తరుణంలో సోమవారం ఉదయం పొగమంచు (మొగిలి) పంటలపై అలుముకోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వరి పూర్తయ్యే దశ, జొన్నపంట కంకి దశ , నూగు పంట పూత దశలో ఉండడంతో ఈ మంచు పొగ ఈ పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు పేర్కొన్నారు. గతంలో కూడా తుఫాన్లు వచ్చిన సమయంలో పొగమంచు రావడంతో పంటలు దెబ్బతిన్న రోజులున్నాయన్నారు. వరి గింజ పాలు పోసుకునే దశలో ఈ పొగమంచు వడ్ల గింజలోకి పోవడం ద్వారా తాలు ఏర్పడుతుందని రైతులు తెలిపారు. ఈ మొగిలి నవంబరు, డిసెంబరులో పూత దశలో ఉన్న పైర్లపై ఎక్కువ ప్రభావం చూపుతుందని దీంతో దిగుబడి తగ్గే అవకాశంతో పాటు రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు.

ఎర్రతెగులు వచ్చే అవకాశం ఉంది

వరిలో పొగ మంచుద్వారా ఎర్రతెగులు వచ్చే అవకాశం ఉన్నందున బీమ్ అనే మందును 120 గ్రాములు ఒక ఎకరాకు పిచికారీ చేయడం ద్వారా ఈ తెగులు వ్యాప్తి చెందకుండా పంటను కాపాడుకోవచ్చు. పూత దశలో ఉండే పంటల్లో మొగిలి తగ్గిన వెంటనే నీటిని పిచికారీ చేయడం ద్వారా కొంత ప్రభావం తగ్గి పంట దిగుబడి పెంచుకోవచ్చని ఆయన రైతులు సూచించారు.

● శివరామక్రిష్ణారెడ్డి, వ్యవసాయాధికారి



పూత దశలో ఉన్న నువ్వుల పంట





వరి, కంకి దశలో ఉన్న జొన్న మీద దుప్పటిలా పరుచుకున్న పొగమంచు

పేదలకు ఇంటిస్థలాలు, భూపంపిణీ చేయాలి

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన హామీని నెరవేర్చాలని సీపీఐ స్థానిక కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నేతలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పేదవానికి 3 సెంట్ల ఇంటిస్థలం, రెండు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం బయనపల్లె సచివాలయం వద్ద సీపీఐ వ్యవసాయకార్మిక సంఘం మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగదాసరి ఇమ్మానుయేల్,బాలు, నాగరాజు, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడుసెంట్లు ఇంటిస్థలం ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయాల వద్ద సీపీఐ, బీసీఐఎంయు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చెన్నయ్య, షాహిద, సఫా పాల్గొన్నారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతిపత్రం అందించారు.



బద్వేలు... బయనపల్లె సచివాలయం వద్ద ధర్నా చేసున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కలసపాడు..: ప్రతి పేదవాడికి రెండు ఎకరాల బంజరు భూమి, ఇల్లులేని వాడికి ఇంటిజాగా కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి గుడిమె సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. రాజశేఖర్‌రెడ్డి సర్కిల్ నుంచి కలసపాడు సచివాలయం వరకు భారీ ర్యాలీతో వెళ్లి సచివాలయాల సెక్రటరీకి వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నారాయణ,శారద,బాషా, గుడిమె వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు ఎకరాల సాగుభూమి, మూడుసెంట్ల ఇంటిస్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పడిగె వెంకటరమణడిమాండ్ చేశారు. సోమవారం బీకోడూరు సచివాలయంలో నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, విజయరావు ప్రజలు పాల్గొన్నారు.

గోపవరం..: పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చే వరకు పోరు ఆగదని సీపీఐ మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య అన్నారు. సోమవారం సండ్రపల్లె, రాచాయిపేట, బేతాయపల్లె, వల్లెరవారిపల్లె సచివాలయాల వద్ద ధర్నా చేశారు.బీకేఎంయూ, డీహెచ్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.

కొండాపురం..: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చాలని పలువురు డిమాండ్ చేశారు.సోమవారం కొండాపురం సచివాలయం ఎదుట పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కార్యదర్శి శర్వాణికి వినతిపత్రాన్ని అందజేశారు.

రెవెన్యూ అధికారుల రిపోర్టును పరిగణనలోకి తీసుకోండి : ఎమ్మెల్సీ

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు విచారణ చేసి కొండాపురం లోని 14 మునక గ్రామాల్లో రిపోర్టు తయారు చేసి ఇచ్చినా ఇప్పటికీ సమస్య పెండింగ్‌లో ఉందని దాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొండాపురం మండలంలోని గండికోట ప్రాజెక్టులో మొదటి విడతగా 14 గ్రామాల్లో అధికారుల సర్వేలో 14 గ్రామాల్లో నివాసం ఉన్నవారి పేర్లు కొన్ని అదృశ్యమయ్యాయని, మిస్సయినవారందరూ వారి వారి పేర్లు గెజిట్‌లో రాలేదని తెలుపడం జరిగిందన్నారు. వాటిని విచారణ చేసి గెజిట్‌లో చేర్చాలని రెవెన్యూ అధికారులకు బాధితులంతా అప్పట్లో అర్జీ ద్వారా ఇచ్చారన్నారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు గుర్తించి రిపోర్టు ప్రభుత్వానికి ఇచ్చినా సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. వారందరినీ గెజిట్‌లో చేర్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని, శాసనమండలిలో స్పెషల్ మైన్స్ కింద ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

నేలవాలిన వరి పరిశీలన

కాశినాయన నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కరిసిన వర్షాలకు పలుచోట్ల వరి నేల వాలింది. దీంతో వ్యవసాయాధికారి స్పందించిన ఏవో జయలక్ష్మి సోమవారం నర్సాపురం, సావిశెట్టిపల్లె,వడ్డమాను, వరికుంట్ల తదితర గ్రామాల్లో దెబ్బతిన్న వరిచేలను పరిశీలించారు. దెబ్బతిన్న వరిపై వివరాలు సేకరించి జిల్లా అధికారులకు రిపోర్టు పంపామన్నారు.

మాలధారులకు అన్నప్రసాదం వితరణ



బద్వేలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నెల్లూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి డిసెంబరు 26 వరకు అయ్యప్ప మాలాధారులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్లతో నూతన నిర్మాణం చేపట్టామని, సంవత్సరంలోపు విగ్రహ ప్రతిష్ఠ పూర్తిచేస్తామన్నారు. ఏకశిల పవిత్రమైన పడిమెట్లు, ఒకే రాతితో నిర్మాణం చేయడం జరుగుతుందని అలాగే 36 అడుగుల ధ్వజస్తంభం ఏకశిల ఏర్పాటు పూర్తి నిర్మాణం జరుగుతుందన్నారు. శబరిమల వరకు వెళ్లలేని మాలధారులు ఇక్కడే ఇరుముడి చెల్లించే విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

పరిహారం పెంచండి

ఎర్రగుంట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి-రాయచోటి వరకు నిర్మించే జాతీయ రహదారి నాలుగులేన్ల రోడ్డుకు తీసుకునే భూములకు ఇచ్చే ధరను పెంచాలని బాధిత రైతులు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. జమ్మలమడుగులో ఈ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 200 ఎకరాల వరకు ఎర్రగుంట్ల, చుట్టుపక్కల గ్రామాల రైతులు ఈ రోడ్డుకు కోల్పోతున్నట్లు తెలిపా రు. దీంతో ఎమ్మెల్యేకు ఈ విషయం విన్నవించి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చి నట్లు తెలిపారు. ఈవిషయంపై సానుకూ లంగా స్పందించాలని ఎమ్మెల్యే కూడా కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారని రైతులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీజేపీ నాయకులు కత్తిప్రతాప్‌రెడ్డి, ఆర్.నాగరాజు, జగదీష్, శ్రీనివాసులు తదితరులున్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని శైవక్షేత్రమైన కన్యతీర్థంలో కార్తీక సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఉదయాన్నే శ్రీ బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా కన్యతీర్థంలోఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే జమ్మలమడుగులోని సోమేశ్వరస్వామి దేవాలయం, ముద్దనూరు రోడ్డులోని నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకవనభోజన కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

ప్రొద్దుటూరు టౌన్..: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సైకతలింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ చక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు నిమ్మకాయలతో , స్వామివారి ఉత్సవ మూర్తిని అఘోర ఈశ్వరునిగా అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా స్వామివారికి అభిషేకాలు చేశారు. అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకత లింగం, జలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీపాల వెలుగులో శివాలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి.

కొండాపురం..: మండలంలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి.మూడో కార్తీక సోమవారం కావడంతో బాలప్పకోన ,మల్లేశ్వరకోన,దొంతికోన తదితర చోట్లకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అదేవిధంగా కొండాపురం,గండ్లూరు,సుగుమంచిపల్లెతదితర శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

చాపాడు..: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో మూడో కార్తీక సోమవారం సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారిని దేవాలయం ఆవరణలో ఊరేగింపు జరిపారు. ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వేల మంది భక్తులు వచ్చారు. శ్రీరాములపేట గ్రామానికి చెందిన మహిళలు వేసిన కోలాటం పలువురిని బాగా ఆకట్టుకుంది. సర్వమత అన్నదాన సత్రం, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో దేవస్థానం తరుపున భక్తులకు అన్నదానం చేశారు.



ప్రొద్దుటూరు... రామేశ్వరంలో పుష్పాలంకరణలో సైకత లింగం

దువ్వూరు..: దువ్వూరు మండలంలో కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా ఆలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల సందడితో ఆలయాలు కళకళలాడాయి. దువ్వూరు, వెంకుపల్లె వద్ద ఉన్న ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఖాజీపేట..: కార్తీక మూడో సోమవారం సందర్భంగా ఉదయం నుంచి స్వామివారిని క్యూలైన్‌లో నిలబడి దర్శించుకున్నారు. కాగా బండలాగుడు పోటీలు ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించగా మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు.భక్తులకు పాల వ్యాపారులు, భక్తులు, ఆర్యవైశ్యులు, కాశిరెడ్డినాయన ఆశ్రమంలో భారీగా అన్నదానం నిర్వహించారు. మూడు గంటలకుపైగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొండ కిందిభాగంలో నిర్వహించిన కోలాటం భక్తులను అలరించింది.

బద్వేలుటౌన్..: పట్టణంలోని పలు శివాలయాలలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. చెన్నంపల్లె సమీపంలో భవాని సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే దత్తసాయిబాబా ఆలయంలోని ఓంకారేశ్వర స్వామి ఆలయంలో కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. మృత్యుంజయేశ్వర ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



చాపాడు...వీరభద్రస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



ఖాజీపేట... కోలాటం చేస్తున్న దృశ్యం